ప్రేమంటే
కామం వ్యామోహం
అనుకునే లోకంలో
ప్రేమకు
ఆ జంట చెప్పిన
కొత్త నిర్వచనం?

# నేను...నీకై

విజయరత్న
కథ

నాకేమిటో ఒక్కసారిగా వేరే ప్రపంచం లోకి వచ్చినట్టుగా వుంది! అంతా కొత్త మనుషులు, కొత్త వాతావరణం. ఇక్కడంతా టైము ప్రకారం జీవితం పరుగెత్తుతుంది. ఈ కాలేజి ఆరు ఎకరాల స్థలంలో వుంది. ఈ కాలేజి వాతావరణం అంతా నాకు చాలా కొత్తగా వుంది.

ఈ ప్రపంచంలో అందరి వ్యక్తుల్లోకి దురదృష్టవంతుడు, స్నేహం అంటే ఏమిటో తెలియని వ్యక్తి. నీకు స్నేహితులున్నారా! నువ్వు అదృష్టవంతుడివి. ఎవ్వరూ లేరా? సంపాయించుకోవటానికి ప్రయత్నించు అనే మాటలు నాకు చాలా బాగా నచ్చాయి.

ఇంతలో నాతోపాటు కాలేజీలో చేరిన అమ్మాయిల గుంపు అటుగా వెళ్తుంది. వారిలో ఆమె నన్ను ఒకసారి క్రింది నుండి పై వరకు పరిశీలించి చూసి, చిరుగాలికి నుదురుపై బడే ముంగురుల్ని మళ్లీ వెనక్కి తోసుకుంటూ చూస్తూ వెళ్తోంది.

ప్రేమ ఉద్భవించడానికి పాలిక సంఘటనలు అక్కర్లేదు. మనసనే బీడుమీద వర్షపు ముక్కలాంటి ఓ చిరునవ్వు.. ఓ కనుచూపు చాలు.

ఆమె ఎంతో అందంగా వుంటుంది. పసుపు పచ్చని ఛాయ... నవ్వినపుడు దానిమ్మగింజల్లా కనబడే పలువరుస.. ఆ కళ్లల్లోని ఆకర్షణా, కాంతి... ఒక పురుషుడు ఒక స్త్రీపై ప్రేమతో తాజ్‌మహల్ కట్టించాడంటే ఇన్ని రోజులు ఎంతో విడ్డూరం అనుకున్నాను. ఆమెని చూడగానే అందులో వింతేమీ కనిపించలేదు. కానీ...

* * *



పడవొచ్చి ఒడ్డున ఆగగానే ఆమె క్రిందికి దిగింది. చేతిలో పుస్తకాలు నీటిలోకి జారకుండా ఎదకి హత్తుకొని వెనుదిరిగి నాకు చేయి ఊపింది. నాతోపాటుగోదావరి అర్థం చేసుకున్నట్టుంది— నవ్వింది.

కాలువగట్టుమీద నుంచి వస్తూన్న చల్లగాలికి కదిలే కొబ్బరాకు కూడా తన అల్లరి చేష్టలు ఆపి మా చేష్టలు చూస్తున్నది.

ఆమె నన్ను చూసి పలకరింపుగా నవ్వింది.

నేను నవ్వు కూడా మరచి చూస్తున్నాను . ఆమె అందాన్ని కాదు చూస్తున్నది... కళ్లని ఎక్కడో చూశాను. వాటిలో అత్యద్భుతమైన అందం లేదు. కానీ దానికన్నా అతీతమైన శక్తి వుంది.

ఆ.. గుర్తొచ్చింది.

ఇవే కళ్ళు. అవీ ఇలాగే ఆప్యాయతని వర్షించేవి. ఆ ఆలోచన రాగానే నేను ముగ్ధుడనై ఆమెవైపు మరింత ఉత్సుకంగా చూసేను. ఆమె నుంచి నాలోకి ఏదో ప్రవహిస్తున్న అనుభూతి... అట్టడుగు అగాధాల్లో వున్నవాడిని సైతం పైకి లాగడానికి స్వర్గం నుంచి వచ్చిన శక్తి మెట్లుమెట్లుగా ముందు నిలబడింది.

ఆ రోజు రాత్రి నేను దిండులో తలదాచుకొని పడుకున్నాను. మనసు చుట్టూ ఒక అందమైన భావం, ముగ్ధమైన పరిమళంలా ఆవరించుకుని వుంది. ఉక్కిరి బిక్కిరి అయ్యేటంత శక్తి దేనికైతే వుందో నేను కూడా దానిలో కొట్టుకు పోతున్నాననిపించింది.

అది ప్రేమ కావచ్చు, ఆకర్షణ కావచ్చు, స్నేహం కావచ్చు నేనెక్కడ తేలతానో కాలమే నిర్ణయించాలి.

* * *

అప్పటికే ఆమె కాలేజీలో చేరి నాలుగు రోజులు కావొస్తుంది. ఇంత వరకు నేనెప్పుడూ ఆమె కంఠం వినలేదు. ఆడవాళ్లు మౌనంలో అంత అందాన్ని సంతరించుకోగలరని నేను అప్పుడే తెలుసుకున్నాను.

మూడురోజులు అలాగే గడిచాయి. నేనారోజున ముందే వచ్చాను. ఆమె నన్ను చూసి పలకరింపుగా నవ్వింది. (నేను నవ్వలేదు) ఆమె దగ్గరగా వచ్చింది.

"ఏం? ఈ రోజు తొందరగా వచ్చావేం?–" అని పలకరింపుగా అడిగింది.

ఉలిక్కి పడ్డాను. మాట తడబడింది.

"ఏమ్..ఏమ్.. ఏమీలేదు" అన్నాను.

ఆమె నవ్వింది. కళ్లలోంచి జారిన నవ్వు పెదాల మధ్య బిగించినట్టు.

నేను తలవంచుకొని లోపలికి వెళ్లిపోయాను. ఆ రోజు పాఠాలు కూడా సరిగ్గా తలకెక్కలేదు. క్లాసులో లెక్క తప్పు చేశాను. ఆ మధ్యాహ్నం ఆమె ఎదురయ్యింది. ఆమె నన్ను తలెత్తి చూసింది. మళ్లీ అదే చిరునవ్వు. ఆ రాత్రి అందుకే నాకు నిద్ర పట్టలేదు. అలా నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపాను. నేను ఆమెని కలవలేదు. కలవాలని మనసులో ఎంత వున్నా ఎందుకో భయమేసింది. భయంకూడా కాదు. కొద్దిగా మొహమాటం, కాస్త సిగ్గు ఇలా రకరకాల భావాల మిశ్రమం.

* * *

నిజానికి LUNCH HOURలో ఆమెని కలుసుకోవాలని ప్రయత్నించాను. కాని ఆమెతోపాటు చాలామంది Students వుండటంతో ఆగిపోయాను. ఏది ఏమైనా ఈ రోజు ఆమెతో మాట్లాడి తీరాలి. ఫెయిలయితే మనసు బాధపడిపోతుంది. ఇలా అనుకోగానే చాలా ఉత్సాహమనిపించింది.

నేను ఎక్కడ ఎలా మాట్లాడాలి అని క్లాసుకు వెళిల ఆలోచిస్తుండగానే ఆమె లైబ్రరీకి వెళ్లటం కనిపించింది.

అంతే నా మనసు కోసం నేను క్లాసు మధ్యలోనే లేచి బయటికి నడిచి లైబ్రరీలోకి వచ్చాను. పెద్దగా అలికిడి లేదు. నలుగురైదుగురు స్టూడెంట్స్ తప్ప ఓ మూల ఒంటరిగా కూర్చొని చదువుకుంటుంది. చాలో సన్నని తడబాటు. గొడవపడటానికైతే చాలా దూకుడుగా వెళ్లగలిగే వాడ్ని. కాని ఇపుడు వెళ్తున్నది అందుకు కాదు. అయినా వెళ్లి ఏం మాట్లాడాలి? ఓ లిప్తపాటు నా మనసు గుర్తొచ్చి 'పిచ్చిమొద్దులా ఆలస్యమేమిటి?' అని మందలించినట్లు అనిపించడంతో దూకుడుగా ఆమెను చేరుకున్నాను. చాలాసేపు నిలబడినా ఆమె పట్టించుకోలేదు. ఇపుడు మాట్లాడ్డమూ నా మనసుకోసమే అనుకుంటూ ఆమె ప్రక్కన సీటులో కూర్చున్నాను— చిన్నగా కుర్చీ చప్పుడు చేస్తూ. అపుడు చూపింది. ఆ చూపులు ఏ గుండె పొరల్లోనో చొచ్చుకుపోయినట్టనిపించి ప్రేమ గురించి మహా కవులు చెప్పిన కొటేషన్స్ అన్నీ సీరియల్‌గా గుర్తుకొస్తుంటే— "హల్లో!" అన్నాను తొట్రుపాటు పడుతూ.

మృదువుగా అదే నవ్వు నవ్వింది.

ఇప్పుడేం మాట్లాడాలి అని నేను సంశయిస్తుండగానే అన్నది "ఏమిటి?" అని.

నాకు ఏం మాట్లాడాలో బోధపడలేదు. ఈ స్థితి ఇబ్బందిగా అనిపించిందేమో 'మీకు కోపం రాదంటే ఒక్కమాట'.

'ఎందుకలా అంటున్నారు?' అడిగింది.

ఒక నిముషం మా మధ్య నిశ్శబ్దం రాజ్యమేలింది.

"ఆడిటోరియం దగ్గరకి వెళ్దాం వస్తారా?—" అని అడిగాను. ఆమె భుజాలు కదిలించింది. ఆడిటోరియం వెనకాల మెట్లమీద కూర్చున్నాము. గులాబీరంగు పరికిణీమీద, తెల్లఓణీ వేసుకుంది. నా ప్రక్కన అంత దగ్గిరగా కూర్చోవటం ఆమెకు ఇబ్బందిగా

## రాజకీయం



ఓడలు బళ్లూ—బళ్లు ఓడలూ అవుతాయనటానికి సరికొత్త ఉదాహరణ ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారాయణ్ దత్ తివారీ—ప్రధాని పీవీలు! పీవీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేంద్ర పరిశీలకుడిగా తివారీ హైదరాబాద్ వచ్చి— అసమ్మతి వర్గాన్ని సపోర్ట్ చేసి ఆయన వద్ద రాజీనామా తీసికోమని శ్రీమతి గాంధీకి సలహా ఇచ్చాటు! ఆలా తివారీ మూలంగా ముఖ్యమంత్రి పదవి పోగొట్టుకున్న పీవీ ఇపుడు ప్రధాని అయ్యాడు. ఆనాడు అంతటి ముఖ్యమైన వ్యక్తిగా చెలామణీ అయిన తివారీ—ఈనాడు ఏ పదవీ లేకుండా పీవీ ముందు తలవంచుకోవల్సిన పరిస్థితి వచ్చింది— దటీజ్ రాజకీయం!

— జూపిటర్

వున్నట్టుంది. కానీ లేదు. ఒద్దికగా గోడకు ఆనుకుని కూర్చొంది. మధ్యలో నేను ఏమైనా మాట్లాడుతానేమోనని అనుకున్నది. కానీ నేను మౌనంగానే వున్నాను. ఆ మౌనం ఆమెకు అర్థం గాకుండా వుంది. కొత్తగా కూడా వుంది. ఆ కొత్తదనం ఆమెలో కుతూహలాన్ని రేపింది. ఆమెకు నవ్వు వస్తుంది. ఈ దాగుడుమూతలు ఆమెకు చాలా బాగున్నట్టున్నాయి.

నేను మాట్లాడటానికి కొంచెం యిబ్బంది పడుతుంటే ఆమెకు అనుమానం వేసింది. ఈ లోపులో గొంతు సవరించుకుంటూ నేనన్నాను. "LOVE AT FIRST SITE" గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. కానీ మొట్ట మొదటిసారి మిమ్మల్ని చూసినపుడు నాకెందుకో మనసంతా అదోలా అయిపోయింది. దాన్ని ప్రేమ అంటారని ఇప్పుడే తెలిసింది. మీకు నవ్వు రావచ్చు. కానీ నన్ను నమ్మండి. నాకింతకంటే ఏం చెప్పాలో తెలీటం లేదు".

ఆమె మెదడు బ్లాంక్ అయ్యింది. ఏదో అవుతుందని ఎదురు చూడటం వేరు. ఎదురు చూసిందైతే దాన్ని ఎదుర్కోవటం వేరు. ఆమెకు మొహంలో ఫీలింగ్స్ ఎలా పెట్టాలో అర్థం కాలేదు. బహుశా చేతకాలేదేమో. ఆ పరిస్థితుల్లో ఏం మాట్లాడాలో ఆమెకు తెలియలేదు. ఈ లోపు నేను.. "నేను అయోమయంలోనే వున్నాను. అంటే మీతో ప్రేమ విషయంలో కాదు. నేను నా విషయంలో ఇంత హఠాత్తుగా, ఈజీగా బౌల్డ్ అవుతానని నాకే తెలియదు. మిమ్మల్ని యిబ్బంది పెట్టడం నా ఉద్దేశం కాదు. మీకు కావల్సినంత టైము తీసికోండి. ముందు మీ నిర్ణయం చెప్పాకే తర్వాత విషయం ఆలోచిద్దాం. అప్పటి వరకు మంచి స్నేహితులుగానే వుందాం. సరేనా" అన్నాను. ఆమె మౌనంగా తలవంచుకుని మృదువుగా "ఐ టూ లవ్ యూ" అంది. ఆ క్షణం నుంచి...

అలా... మా మధ్య ప్రేమ సాయంకాల నీడలా పెరిగింది.

*    *    *

కాలేజీలో ఆమెకు అంతా నా గురించి ఆలోచనే. రోజూ కాలేజీలో నేను కలిసేవాళ్ళే. కానీ, యిప్పటి పరిసిథతి వేరు. ఆమెలో వచ్చిన మార్పుని ఇంట్లో తల్లిదండ్రులు గుర్తించారు.

అగ్నిపర్వతం లోపల కుతకుత ఉడికే లావా వత్తిడి ఎక్కువైతే ఒక్కసారిగా పేలిపోతుంది. ఆమె పరిస్థితి అలాగే వుంది. అయితే లోపల ఎక్కడో ఒకమూల సంచలనం మాత్రం ప్రారంభమయింది. ఏదో చేయాలి! ఈ "ఏదో చేయాలి" అన్న తపన ఆమెలో రోజురోజుకీ పెరిగిపోతుంది. ఆ తపన ముందు తల్లిదండ్రులు, అన్నయ్య, అక్క, చెల్లి అందరూ చిన్న విషయాలుగా కనబడ్డారు.

అదే ఆమె చేసిన తప్పు.

*    *    *

ఆ మూడు రోజులు ఆమె కాలేజీకి రాలేదు.

తరువాత రోజు తలంటు స్నానం చేసి


ఆకుపచ్చ పట్టు పరికిణీ మీద ఎర్ర ఓణీ వేసుకుని కాలేజీకి వచ్చింది. ఆమె నన్ను గుర్తు పట్టలేకపోయింది. కళ్లు లోపలికి పోయాయి. ఆమెను చూసి దాదాపు ఏడ్చేశాను. ఆమె కడుపు తరుక్కుపోయింది. పసిపిలాలడిలా వున్న నా మొహం చూడగానే ద్రవించిపోయింద. నా దగ్గరకు వచ్చి ఆమె చేతుల్లో మొహం దాచుకుని ఏడ్చేసింది. ఆమె మొహం ఎత్తి పటుటకుని ఆవేశంగా అడిగాను. "ఇలా మూడు రోజులు కనిపించకపోతే ఏమైపోతాననుకున్నావు? అంత ప్రేమున్నదానివి ఇలా ఎలా చేయగలిగావు? నీ కోపం వస్తే నాలుగు తిట్టు. అంతేగానీ కనిపించకుండా వుండకు సరేనా!"

ఆమె రోషంగా "నేను..." అని ఏదో చెప్పాలని నోరు తెరిచింది. ఆమెకు ఎలా చెప్పాలో తెలియక సిగ్గుపడింది. కన్నుల నుంచి జారుతున్న నీటి బిందువులను తన చేతితో అద్దింది. అదే ఆమె నన్ను మొదటి సారి స్పృశించటం! ఆ స్పర్శ మా యిద్దరిని ఏదో తెలియని మైకంలో పడేసిందంటే ఆశ్చర్యం ఏముంది? అయితే నిస్సందేహంగా మా యిద్దరి దగ్గరితనంలో ఎలాంటి కోరికా, కల్మషం లేదు. ఆ చిన్న సంఘటన మా యిద్దర్నీ మరింత దగ్గర చేసింది. అప్పుడు నాకు తెలిసింది.

నేను లేనిది ఆమె వుండదని. అనుకున్నది, అనుకున్నట్టు జరిగితే అది జీవితం కాదు. ఒక్కో చిన్న సంఘటనే జీవితంలో పెద్ద మలుపుకి దారి తీస్తుంది.

* * *

ఒకరోజు అమ్మా, నాన్న మాట్లాడుకునే మాటలు వింటుంటే ఆమెకు ఎంతో భయమేసిందంట. ఆ మరుసటి రోజే నాతో చెప్పింది. "లవ్ మారేజ్‌కి మా నాన్నగారు ఎంత వ్యతిరేకమో ప్రత్యక్షంగా చూస్తున్నాను. రేపు మనిద్దరి సంగతి తెలిస్తే బ్రతకనివ్వరు" అని చెప్పింది. ఏం చేద్దామంటావు అని అడిగింది. నేను కూడా ఆ విషయమే ఆలోచిస్తున్నట్టు కనబడ్డాను.



"నేను సరిదిద్దుకోలేనంత పొరపాటు చేశానా అన్న ఆలోచన పదేపదే నాకు కలిగేది.

అక్కడితో ఆ విషయం మార్చేసి "రేపటి పుట్టినరోజు పాపకు నా శుభాకాంక్షలు సరికొత్త తరహాలో చెప్పబోతున్నాను" అని అన్నాను. అప్పటి వరకు తన పుట్టిన రోజు తనకే గుర్తు లేనందుకు బాధపడాలో, ఇంత చిన్న విషయం తనకన్నా ఎక్కువ గుర్తుంచుకున్న నన్ను ఎలా ఆరాధించాలో తెలియలేదు.

దార్లో ఆమెకు చెప్పవలసింది చెప్పాను. ఆమె ఒక్క క్షణం తెల్లబోయి అంతలోనే సర్దుకుంది.

నేను బెడ్‌మీద వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాను. ఎక్కడికి వెళ్ళాలి అన్న ప్రశ్న లేదు. వెళ్లి ఏం ఏం చెయాలి అన్న సమస్య లేదు.

* * *

వేసవి వచ్చినా ఇంకా తెల్లవారుఝాము చలి పూర్తిగా పోనేలేదు. తూర్పు ఎర్రదనం పోవటానికి చాలా సమయముంది. ఉదయాన్నే నిద్రలేచి దేవుణ్ణి ప్రార్ధించాను. ఎపుడో కాని ప్రార్ధన చేసేవాడ్ని, ఈ రోజు కాని ఎక్కువ చేశాను. నేను గట్టుమీద కూర్చుని ఆమె కోసం ఎదురు చూస్తున్నాను.

ఆమె చెవులమీదకు జారిన ముంగురుల్ని అరచేతి వెనకవైపుతో పైకి తోసుకుంటూ వచ్చి అలసటగా నా వైపు చూసి నవ్వింది. తనే ముందడుగు వేయాలో నేనే వచ్చి నడుము చుట్టూ చేతులువేసి నడిపించుకు వెళ్లాలో... తెలియనట్టు అక్కడే నిలుచుండి పోయింది. కొద్దిసేపు.

నా పరిస్థితి దాదాపు అలాగే వుంది. చివరకు ఆమె కదిలింది. ఆమె నా ఎదురుగా వచ్చి తలదించుకుని నుంచుంది.

ఈ రోజు కోసం మనసులో ఎన్నో రిహార్సల్స్ వేసుకుని, చివరకు అన్నీ మరచి ఏం చేయాలో తెలియనట్టు కొద్ది క్షణాలు అలాగే కూర్చున్నాను. "ఇంక రావేమో అనుకున్నాను" అన్నాను.

ఆమె మాట్లాడలేదు. కొంచెం నిశ్శబ్దం. నేనేమైనా అంటానేమో అనుకుంది. నేను మాట్లాడకపోయేసరికి ఆమె "ఈ రోజు నువ్వు అదోలా వున్నావేం?" అంది.

"ఎలా వున్నా?"

"ఏదో పోగొట్టుకున్నవాడిలా".

నేను జవాబు చెప్పలేదు.

"ఛీ! నీకసలు ఏమీ తెలియదు".

"ఏం తెలీదు".

"అమ్మాయిల్తో ఏం మాట్లాడాలో తెలీదు".

"....."

"ఏమైనా కబుర్లు చెప్పు".

"ఏం చెప్పను".

అది కూడా నేనే చెప్పాలా అంటూ పడిపడి నవ్వి, నా చేతిని చేతిలోకి తీసికొంది. నేను రెండు చేతుల్లోకి నీటిని తీసికొని "నా జీవితాన్ని యిలా దోసిలిలో ఉంచి అర్పిద్దామని ఎదురు చూస్తున్నాను. ఈ మనసు, ఈ శరీరం ఒకరికే. ఆ ఒకరూ ఎవరో నీకు, నాకు తెలుసు. నీకింకా చాలా యవ్వనం ఉంది. నీకు పూర్తిగా అర్థం చేసుకునే

వయసు కూడా లేదు. నా జీవితంలోని విషాదమంతా నీకు చెప్పి నిన్ను భయానికి గురి చెయ్యడం నా కిష్టం లేదు. ఆ విధంగా నువ్వు నా నుంచి దూరం అయిపోతావేమో నన్న భయం కూడా నాకు కలిగింది. నీ ఊహల్లోనూ నీ అమాయకత్వంలోనూ, నీకెంత కాలం సాధ్యమైతే అంతకాలం నువ్వు కొనసాగడం మంచిది'' అంటూ ఏవేవో చెప్పాను.

''అమ్మో.. ఏమో అనుకున్నాను చాలా తెలుసే'' అంది. నాకు కడుపులోంచి సన్నటి నొప్పి గుండెల్లోకి ఎగజిమ్మింది... క్షణంసేపే. అంతలో సర్దుకుంది.

''అయితే నేనే చెబుతాను చెయ్యి యివ్వు అంటూ చొరవగా నా చెయ్యి తీసికొని ఒడిలో పెట్టుకుని నవ్వుతూ నావైపు చూసింది. నాకు వళ్లంతా చెమటలు పట్టేంది. శరీరం సన్నగా వణుకుతుంది.

నా ఎదుట ఆమె

ఆమె కన్నుల మూతలో నేను

ఆమె ఎదుట నేను

నా కన్నుల మూతలో ఆమె

నా చేయి ఆమె జుట్టును నిమురుతూనే వుంది. ఆమెని పొదివి పట్టుకుని, ఒక్కసారిగా దగ్గరకు లాక్కున్నాను. ఆమె విసురుగా నా వళ్లో పడింది. జుట్టంతా ఆమె మొహం మీదపడి కప్పేసింది. నేను అతి అపురూపంగా తలను లేపి పట్టుకుని, రెండు చేతులతోనూ పదిలంగా తన మొహానికి దగ్గరగా చేర్చాను.

మెల్లి, అతి మెల్లిగా నా పెదవుల్ని ఆమె పెదవులు మీదకు చేర్చాను. అప్పటికే ఆమె కళ్లు మూసుకుంది. నా స్పర్శ కూడా తెలియని లోకాల్లోకి వెళ్లిపోయింది.

ఓ క్షణం ఆగి... అతి చిన్న అలలా మొదలైనా ఆవేశం పెను తుఫానులా మారినట్టు అప్పుడే వచ్చింది నొప్పి. వింటి నుండి బాణం వదిలినట్టు కడుపులోంచి గుండెల్లోకి పాకింది. ''అమ్మా!'' అనుకుంటూ ముందుకు వంగాను.



## రాజకీయం

సినీ నటిని ఇంటర్వ్యూ చేస్తున్నాడు విలేకరి. ''మీరు రాజకీయంలోకి వచ్చే అవకాశం ఉందా!''

''సినీ ఫీల్డు సిగ్గులేనిదైతే.. రాజకీయం లజ్జలేనిది రెండు ఒకటే కాబట్టే వచ్చినా రావచ్చు'' అంటూ తన సమాధానం ముగించింది సినీ నటి.

– ముక్కాల గోపీచందర్ (మహబూబాబాద్)

"ఏమైంది?" అని అడిగింది.

"క—కడుపులో నొప్పి"

ఆమె కంగారుపడింది "నాను తేనా" అడిగింది.

"వద్దు. అదే తగ్గిపోతుంది" కడుపు పట్టుకుని అన్నాను. మరిక ఏమి చేయాలో తోచనట్టూ నా వైపు చూస్తుండిపోయింది. నేను మెలికలు తిరుగుతున్నాను. ఆమెకి భయం వేసింది. కళ్లు మసకలు కమ్ముతున్నాయి. పూర్వం అయితే నాకు నేనే ఓదార్చుకునేవాడ్ని. ఇప్పుడిక... నాకు దుఃఖం వస్తుంది. ఆపుకోగలగడానికి నా వయసెంతని.

అంతలో

కెరటంలా మళ్లీ వచ్చింది కడుపు నొప్పి. ముందుకు తూలాను. అపుడే ఒక చెయ్యి వచ్చి నన్ను క్రిందపడకుండా ఆపింది. విశ్వాన్ని సాకిన చెయ్యి. కరుణని వర్షించే కళ్లు. నేను తలెత్తి చూశాను. కనుచూపు మసకబారింది. అయినా రూపాన్ని పోల్చుకోగలిగాను.

ఆమె చేతులు నా తలని దయగా ఒడిలోకి తీసుకున్నాయి. యిన్నాళ్ల నాలోనే నిర్లిప్తమైన నిజాన్ని గుండెల్లోంచి గొంతులోనికి ఎగజిమ్మి మాటలు తడబడుతూ నెమ్మదిగా వెళ్లగక్కాను. ఆ నిజాల్ని నిడగానిల్చి నాతో దోబూచులాడే నెత్తురు నోటిలోంచి జారి ఆమెఒడిలో పడుతుంది. నిశ్శబ్దంగా...

ఆ సెలయేటి ఒడ్డున అక్కడే అలాగే...

పిల్లగోదారి ఆకుని నిశ్శబ్దంగా ఓదార్చింది.

"నా నిశ్శబ్దంలోకి అలవోకగా అడుగు పెట్టి సందేహంలా బ్రతుకుతున్న నన్ను స్నేహమనే సందిట బంధించి అణుమాత్రమయినా బాసటగా నిలిచిన నా ప్రియా! ఫలితం ఏమవుతుందో తెలియని స్థితిలో నీ మాటకి కట్టుబడి మన ప్రేమకు చిన్న అర్థాన్ని నిర్వచించాలని ఇలా వచ్చాను. నన్ను ఆశీర్వదించు" అంటూ ముందు కొరిగింది.

ప్రేమ కళ్లతో చూడదు. ప్రేమ మనసుతో చూస్తుంది. అందుకే ప్రేమ గుడ్డిది.

స్త్రీ జీవితంలోకి ఎప్పుడో ఒకసారి, ఒక పురుషుడు మాత్రమే దగ్గరికి వస్తాడు. ఒకే ఒకసారి నిశ్చయంగా ఆ పురుషుడు తండ్రిగానీ, అన్నగానీ, తమ్ముడుగానీ అవడు ఆ ఒకరి కోసమే స్త్రీ కలలు కంటుంది.

ఆ ఒక్కరూ లోకంలో లేకపోతే, తన స్వచ్ఛమైన శరీరాన్ని, మనసును తన వ్యక్తికి అర్పించడం కంటే ఔన్నత్యం ఇంకేమి లేదు.

రెండు తనువుల కలయికతో ప్రకృతి "పరిమళాన్ని" ఆస్వాదించలేకపోవచ్చు.

కానీ

ఈ రెండు మనసుల సంగమంతో నిజమైన 'ప్రేమ'కు పవిత్రతను చేకూర్చి అంకురార్పణ చేసాయి.

నిన్నగాక మొన్నటి దాకా చప్పుడు చేయని చిన్న కాలువలా ప్రవహించే పిల్ల గోదావరి ఇద్దరి సంగమంతో పరిమాణాన్ని పెంచుకుందో లేక ఊహించని పరిణామంతో ఏ గమ్యంవైపు పరుగులు పెడుతుందో అర్థంకాని స్థితి. ★